క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు అందజేశారు. శానపల్లిలంక నేలమూడి దుర్గాప్రసాద్‌కు రూ.20 వేలు, విలసకు చెందిన గుదే దుర్గకు రూ.12 వేలు, అయినవిల్లికి చెందిన గుబ్బల మోహనసాయికి రూ.10 వేలు, అయినవిల్లికి చెందిన కొమానపల్లి నాగలక్ష్మికి రూ.45 వేలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, కుసుమ లిల్లీమంగేష్కర్, బొంతు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ కల్వర్టు పనుల పరిశీలన



శ్లాబ్ కల్వర్టును పరిశీలిస్తున్న నాబార్డు ఏజీఎం నాయుడు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో పంట కాలువపై నిర్మాణంలో ఉన్న శ్లాబ్ కల్వర్టు పనుల్ని నాబార్డు ఏజీఎం డాక్టర్ వైఎస్ నాయుడు మంగళవారం పరిశీలించారు. నాబార్డు నిధులు రూ.9.46 లక్షలతో ఈ శ్లాబ్ కల్వర్టు నిర్మిస్తున్నారు. కల్వర్టు నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. శిథిలస్థితికి చేరిన పైప్ కల్వర్టును తొలగించి దాని స్థానే నాబార్డు నిధులతో శ్లాబ్ కల్వర్టు నిర్మిస్తున్నారు. అక్కడ జరుగుతున్న పనులపై ఏజీఎం నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు ఉన్నారు.

పాశర్లపూడి సత్రం పాలకవర్గం నియామకం



చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న వాసంశెట్టి రామకృష్ణ

మామిడికుదురు: పాశర్లపూడిలోని శ్రీపాశర్లపూడి సత్రం పాలక వర్గాన్ని నియమిస్తూ ఎండోమెంట్స్ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఏడుగురు సభ్యులతో ట్రస్టు బోర్డును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు బోర్డు రెండేళ్ల పదవిలో కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా వాసంశెట్టి రామకృష్ణ, చవటపల్లి వెంకటేశ్వరరావు, నెల్లి సింహాద్రి, చిక్కం శ్రీనివాస్, బిరుదుగంటి దుర్గాభవాని, కట్టా రాజేశ్వరి, పసలపూడి రామసీతలను నియమించారు. ట్రస్టు బోర్డు సభ్యుల పదవీ స్వీకార ప్రమాణం బుధవారం జరుగుతుందని సత్రం ఈఓ కె.గంగాధర్ తెలిపారు. ట్రస్టు బోర్డు సభ్యుల పదవీ స్వీకార ప్రమాణం అనంతరం వాసంశెట్టి రామకృష్ణను చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.

తెరచుకున్న ఫ్లడ్ ప్రొటెక్షన్ గేట్లు



అక్విడెక్టుకు ఎల్.గన్నవరం వైపు మూసుకుపోయిన గేట్లను తెరుస్తున్న దృశ్యం

పి.గన్నవరం: కొత్త అక్విడెక్టు కాలువలో ఎల్.గన్నవరం వైపు నీటి ప్రవాహానికి మూసుకుపోయిన వరద రక్షణ గేట్లను మంగళవారం ఇరిగేషన్ అధికారులు ఓపెన్ చేయించి దిగువ ప్రాంతానికి నీటి సరఫరాను పునరుద్ధరించారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువకు ఇటీవల నీటిని విడుదల చేయడంతో, రిపేరులో ఉన్న గేట్లు సోమవారం మూసుకుపోయాయి. దీంతో దిగువ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోయిన విషయం విదితమే. ఈనేపథ్యంలో మంగళవారం కాలువలో నీటి మట్టాన్ని తగ్గించి, గేట్లను ఓపెన్ చేయించడంతో సమస్య పరిష్కారం అయింది.

లక్కవరం కళాశాలలో కొత్త కోర్సులు

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గురయ్య కళాశాల ప్రాంగణంలోని అల్లూరి వరాహాలమ్మ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా విధానానికి అనుగుణంగా ఆనర్స్ విద్యా విధానంలో బీబీఎ, బీసీఏ, బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, డేటా సైన్స్, కంప్యూటర్స్, అప్లికేషన్స్ కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు ఆయన వివరించారు. విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

పరకే బ్రహ్మాండమాయెనా..

- వేధిస్తున్న ఎండుగడ్డి కొరత
- పాడి రైతులకు మోత
- ట్రాక్టర్ గడ్డి రూ.12 వేలు పైమాటే
- రూ.35 పలుకుతున్న మోపు గడ్డి



ఆలమూరులో ఎండుగడ్డిని ట్రాక్టర్‌పై తీసుకువచ్చి దిగుమతికి సిద్ధంగా ఉన్న దృశ్యం



పెనికేరులో వరికోత యంత్రాలతో కోసి పడవేసిన గడ్డిని సేకరిస్తున్న మహిళా కూలీ

ఆలమూరు: రబీ సీజన్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు.. ఆధునిక యాంత్రీకరణ.. మూగజీవాల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పాడి పశువుల పోషణకు, అధిక పాల దిగుబడికి మేలైన, మెరుగైన దాణాగా ప్రసిద్ధి గాంచిన ఎండుగడ్డి సామాన్య పాడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. వ్యవసాయ విధానం ఆధునీకరణ దిశగా పయనించడంతో పాటు రైతులు తమకు కూలీ ఖర్చులు ఆదా అవుతున్నాయంటూ వరికోత యంత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎండుగడ్డి కొరత సమస్య ఏటా మరింత జటిలంగా మారుతుంది. వరి కోత యంత్రాలను వినియోగించి కోతలు కోయడం వల్ల ఆ గడ్డి నిరుపయోగంగా మారుతుంది. గడచిన మూడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా వేసవిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు రావడంతో కొంత మంది రైతులు వరిపంట తీవ్రంగా దెబ్బతింది. దీనికి తోడు అధిక సంఖ్యలో రైతులు వరి కోత యంత్రాలను ఆశ్రయించడం వల్ల ప్రతి సీజన్‌లో ఎండుగడ్డి కొరత తీవ్రత నానాటికి అధికమవుతుంది. దీంతో స్థానిక పాడి రైతులు సమీప చాగల్నాడు, మెట్ట ప్రాంతాల నుంచి ఎకరం గడ్డిని అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. దీనికి మళ్లీ రవాణా, ఎగుమతి, దిగుమతులు, కూలీల ఖర్చుతో కలిపి రూ.ఐదు వేలు ట్రాక్టర్ గడ్డి ఇంటికి తీసుకువచ్చేసరికి రూ.12 వేల వరకూ అవుతుంది.

ఎండు గడ్డికి భలే డిమాండ్

గతంలో ఖరీఫ్‌లో లభించే ఎండుగడ్డిని పాడిరైతులకు పశుగ్రాసంగా ఏడాది పొడవునా వినియోగించే వారు. మారిన పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లోను యంత్రాల సాయంతో కోతలు కోయడంతో గడ్డి అంతంత మాత్రంగానే దొరుకుతుంది. దీంతో రబీ సీజన్‌లో కూడా ఎండుగడ్డిని సేకరించి పశువులకు దాణాగా రైతులు వేస్తున్నారు. కూలీలతో కోత కోసేందుకు అవకాశం లేకపోవడంతో యంత్రాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి పాడిరైతుల్లో నెలకొంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 12 మండలాల్లో సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా దాదాపు 50 వేల వేల ఎకరాల్లోని పంటను యంత్రాలతోనే కోశారు.

గడ్డి సేకరణ యంత్రాలతో మేలు

ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన గడ్డి కోత యంత్రం (స్ట్రాబేలర్)తో కొంత మంది రైతులు గడ్డిని సేకరిస్తున్నారు. ఈ విధంగా సేకరించి గడ్డి మోపు ధర రూ.35 వరకూ పలుకుతుంది. అంత ధర వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే స్తోమత లేని పేద పాడి రైతులు వరికోత యంత్రాలతో కోసిన పొలాలకు వెళ్లి ఎండుగడ్డిని సేకరిస్తున్నారు. ఆగడ్డిని పదిలంగా చేసుకుని పశువులకు పెడుతున్నారు. గతంలో అయితే పట్టించుకోని ఆ గడ్డి పరకను నేడు బంగారంలా చూస్తున్నారు.

అంతర్వేదిలో వరుణ మంత్ర పారాయణ

సఖినేటిపల్లి: పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామిని ప్రార్థిస్తూ అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం అర్చకులు వరుణ మంత్ర పారాయణ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఈ పారాయణ చేశారు. సకలజన సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ, అందుకు అత్యంత అవసరమైన వరుణ దేవుని అనుగ్రహం కలిగాలని, ఎండలు తగ్గి సకాలంలో వర్షాలు కురవాలని వారు పారాయణలో స్వామిని అభ్యర్థించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: కంటికి సంబంధించిన వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ ఆరు నెలలకోసారి తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ అన్నారు. ఇరుసుమండ సచివాలయంలో కార్యదర్శి రాయి ఏడుకొండలు వంటి అధ్యక్షతన వైఎస్సార్ కంటి వెలుగు స్క్రీన్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. పారా మెడికల్ ఆప్తమాలజిస్ట్ వై.ప్రభాకరరావు కంటి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కె.కుమారివాణి, ఆశాలు సీహెచ్ విజయకుమారి, ఎం.సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు జనం నీరాజనం



లూటుకుర్రులో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు



పెద్దతిప్పలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- లూటుకుర్రు, పెదతిప్పల్లో గడపగడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు

మామిడికుదురు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు నీరాజనాలు పలకుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం లూటుకుర్రులో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ వేసే ప్రతి అడుగు ప్రజల కోసమే, ప్రజల సంక్షేమమే ఆయన అజెండా అని చిట్టిబాబు చెప్పారు. జగన్ పాలనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు విచక్షణతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. సంక్షేమ పాలన కావాల్లో బూటకపు కబుర్లు చెప్పే నేతలు కావాల్లో తేల్చుకోవల్సిన సమయం ఆసన్నమైందని చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, పార్టీ నేతలు చింతా రామకృష్ణ, తులా గోపాలకృష్ణ, కుసుమ పెరుమాళ్లకుమార్, కడలి శేఖర్, బళ్రే చిట్టిబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు చిత్తశుద్ధితో మేలు చేస్తున్న జగన్: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: పేదలకు చిత్తశుద్ధితో సీఎం జగన్ మేలు చేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దతిప్పలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అలాగే అర్హులైన పేదలు ఇంకనూ మిగిలి ఉంటే అక్కడికక్కడే అధికారులకు పథకాలు మంజూరుకు ఆదేశాలు జారీ చేశారు. విద్యావ్యవస్థను పటిష్టం చేసి, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులనందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, రావి గోపాలకృష్ణ, నల్లి బాలకృష్ణ, నల్లి శివకుమార్, చింతా రాజబాబు, దేవ దయానంద్, తిరుమల గవర్రాజు, దాసంశెట్టి వెంకటాచలం, జె.చిరంజీవి, నల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనలకు శంకుస్థాపనలు

మలికిపురం మండలం గూడపల్లిలో 15 ఆర్థిక సంఘం నిధుల్లో మంజూరైన రూ.10 లక్షలతో నిర్మించనున్న 4 వంతెనలకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శంకుస్థాపనలు చేశారు. వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యకు ఎంతో ప్రాధాన్యం



అంతర్వేదిపాలెంలో జేవీకే కిట్లు అందజేస్తున్న సర్పంచ్ రత్నకుమారి

మామిడికుదురు: విద్యకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్లో ఆయన మంగళవారం జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను విద్యార్థులకు అందజేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యతో పాటు వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పాఠశాలల ప్రారంభం రోజునే నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగు, షూలు, తదితర వస్తువులతో కూడిన కిట్లను విద్యార్థులకు ఉచితంగా అందించడం జగనన్న పాలనలోనే సాధ్యమైందన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో సైతం లేని సదుపాయాలు ప్రభుత్వ స్కూళ్లలో కల్పించడం వరంగా విద్యార్థులు భావిస్తున్నారని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ అడబాల తాతకాపు, హెచ్ఎం జి.నాగప్రసాద్, పార్టీ నేతలు, స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచ్ ఓగూరి రత్నకుమారి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నల్లి గోపీనంద్, హెచ్ఎం జె.కనకలింగేశ్వరరావు, నాయకులు ఓగూరి బాబులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

అంబాజీపేట: ప్రతి మనిషికి విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఏర్పడుతుందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల కిట్‌లను మంగళవారం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డురాకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో పేద కుటుంబాలలోని తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకునేందుకు బాసటగా నిలుస్తున్నాయన్నారు. ఉప సర్పంచ్ దారా నాగవేణి, పంచాయతీ కార్యదర్శి తాతాజీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ జరిగింది. స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలల్లో మంగళవారం సర్పంచ్ గుణ్ణం రాంబాబు సుమారు 80 మంది పిల్లలకు ఈ కానుకలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న తీరును ఆయన వివరించారు. ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్, కార్యదర్శి డి.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యా ప్రోత్సాహకుడు సీఎం జగన్



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ తరగతి గదులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: విద్యకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పడిన ఇంటర్మీడియెట్ తరగతి గదులను ఎంపీపీ మంగళవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ హైస్కూల్‌లో బాలికల ఇంటర్మీడియెట్ కోర్సులను ప్రారంభించనున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు బైపీసీ 12, ఎంపీసీ ఆరుగురు విద్యార్థులు చేరారన్నారు. జూనియర్ కళాశాలకు నైపుణ్యం గల ఏడుగురు లెక్చరర్‌లను ప్రభుత్వం నియమించిందన్నారు. విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మోకా ప్రకాష్, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పవిత్ర కాలువ తీరాన వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారి జాతర విజయవంతం చేయాలని సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పిలుపునిచ్చారు. స్థానిక ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మంగళవారం తీర్థ మహోత్సవాలకు అంకురార్పణ, రాట ముహూర్తం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ తమ్మన ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పలు తీర్మానాలు చేశారు. జూలై నాలుగున అమ్మవారికి తీర్థోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని భక్తి పారవశ్యం పొందాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం



కొత్తపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే సీఎం జగన్ ప్రభుత్వం వల్లే సాధ్యమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని ఖండ్రిగ, కొత్తపేట గ్రామాల్లో మండల ప్రజాపరిషత్ నిధులతో నిర్మించే పలు సీసీ రోడ్లకు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపీపీ మార్గన శంకుస్థాపన చేశారు. ఖండ్రిగ గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, కొత్తపేటలోని సంతోష్‌నగర్ ఏరియాలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, మార్కెట్ ప్రాంతంలో రూ.5 లక్షలతో నిర్మించే ముస్లిం వీధి రోడ్డుకు ఎంపీపీ గంగాధరరావు మంగళవారం కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు దూనబోయిన నవదీప, బూసి జయలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ పార్టీ రహితంగా పేదరికం, అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భవిష్యత్‌లో కూడా ఈ విధమైన సంక్షేమ పథకాలు అమలు చేయడం జగన్‌కు తప్ప వేరెవరికీ సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, షేక్ బడేమియా, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, జీబీహెచ్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, ఖండ్రిగ వీడీసీ కన్వీనర్ డీఎస్, కొత్తపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, పార్టీ నాయకులు సలాది మావాజీ, రాయుడు కృష్ణ, కుడుపూడి సంజీవరావు, ఎంపీపీ కార్యాలయం ఏఓ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల కౌలు రైతులతో సమావేశం



అంతర్వేది ఆలయ కార్యాలయంలో రైతులతో సమావేశమైన సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి శృంగవరప్పాడులోని భూముల కౌలు రైతులతో దేవస్థానం కార్యాలయంలో మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమావేశమయ్యారు. దేవస్థానం భూముల్లో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, మట్టి తవ్వకాలు ఎవరూ చేపట్టవద్దని, అక్రమ తవ్వకాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన హితవు పలికారు. దేవస్థానానికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని రైతులకు సూచించారు. కాగా అంతర్వేది, గొంది, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో ఉన్న దేవస్థానం భూముల స్థితిగతులు తెలుసుకునే నిమిత్తం దేవాలయ సిబ్బందితో ఒక కమిటీని నియమించినట్టు ఆయన తెలిపారు. అలాగే వివిధ ప్రాంతాలలో దేవస్థానం భూములకు మక్తాలు తక్కువగా ఉన్నట్టు గుర్తించినట్టు, అటువంటి భూముల విషయంలోను, అవసరమున్న చోట చెరువులు సాగు చేసుకునే నిమిత్తం తగిన అనుమతులకై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. సమావేశంలో పలువురు రైతులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వేంకటేశ్వరునికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి పలువురు భక్తులు మంగళవారం అందజేశారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన కుంపట్ల మాచర రమాసుబ్రహ్మణ్యం-నాగసుభద్ర దంపతులు స్వామికి రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు దాతలకు స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఆలయ దాత కుటుంబీకులకు అందజేశారు.

మోటార్ సైక్లిస్ట్‌కు తీవ్ర గాయాలు

అయినవిల్లి: ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కు తీవ్ర గాయాలైన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సిరిపల్లి గ్రామానికి చెందిన బల్లా మనోజ్ బైక్‌పై ముక్తేశ్వరం నుంచి సిరిపల్లిలోని తన ఇంటికి వెళ్తున్నాడు. అమలాపురం నుంచి ముక్తేశ్వరం వైపు వస్తున్న ట్రాక్టర్ సిరిపల్లిలో అతి వేగంగా వచ్చి మనోజ్‌ను ఢీకొంది. గాయపడిన మనోజ్‌ను స్థానికులు వైద్యం కోసం అమలాపురంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మన ఊరు–మన అంగన్‌వాడీకి శ్రీకారం



మామిడికుదురులో జన భాగీదారీలో పాల్గొన్న సీడీపీఓ విజయశ్రీ

మామిడికుదురు: జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా మన ఊరు మన అంగన్‌వాడీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ తెలిపారు. మామిడికుదురు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గోస్ మొహిద్దీన్ జన భాగీధారీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సమావేశంలో సీడీపీఓ విజయశ్రీ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చక్కటి ఆటలు, పాటలు నేర్పించడంతో పాటు కథలు, ఉచితంగా తెలుగు, ఇంగ్లిషు బోధన నేర్పిస్తామన్నారు. మానసికాభివృద్ధిని, మేధాశక్తిని పెంపొందించడం, స్వేచ్ఛ, ఆట, పాటలు కిడ్స్‌వేర్‌ని తలపించడంతో పాటు అమ్మను మరపించే విధంగా మా అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ఆహ్వానం పలుకుతున్నాయన్నారు. పెదపట్నంలంక, అదుర్రు, బి.దొడ్డవరం, అప్పనపల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, విజయలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కర్బలా యాత్రకు ముస్లింల బృందం

మామిడికుదురు: ఇరాన్, ఇరాక్ దేశాల్లోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా కర్బలా యాత్రకు 15 మంది ముస్లింల బృందం మంగళవారం నగరం నుంచి బయలుదేరి వెళ్లారు. నగరంలోని పెద పంజీషా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఈ బృందం సభ్యులు పాల్గొన్నారు. నగరం ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, అన్వర్ షకీల్ అస్కరీ, రజా హుస్సేన్, రషీద్ తురాబి తదితరులు ఉన్నారు. ఈ బందం సభ్యులకు జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేతలు కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి వికాస్‌బాబుతో పాటు జాలెం సుబ్బారావు, ముస్లిం పెద్దలు వీడ్కోలు పలికారు.

అతిసార నియంత్రణపై అవగాహన కల్పించాలి

ఆలమూరు: అతిసార నియంత్రణ, మలేరియా వ్యాధి నిర్మూలనపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు నేతృత్వంలోని సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు, మలేరియా నిర్మూలన మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మలేరియా నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించవలసిన నియమాలను వివరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని మిశ్రమం చేసి తాగే విధానాన్ని ఆరోగ్య సిబ్బంది వివరించారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, హెచ్‌వీలు పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

గాయపడ్డ ఉద్యోగికి సాయం

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం సచివాలయం అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న రాయి ధనరాజ్ ఇటీవల విద్యుత్ స్తంభం పై నుంచి పడి గాయపడ్డాడు. మంగళవారం అతన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ళ అన్నపూర్ణ పరామర్శించి విజయబేతాళ యువజన సంఘం, శ్రీకృష్ణదేవారాయ కాపు సభ్యులు నల్లా చిన్న నేతృత్వంలో రూ.15 వేలు సేకరించి బాధితుడు రాయి ధనరాజ్‌కు అందజేశారు. ఆమె వెంట గంగుమళ్ళ శ్రీనివాస్, గనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

108లో మహిళ ప్రసవం



108 వాహనంలో ప్రసవించిన మహిళను సంరక్షణను చూస్తున్న ఈఎంటీ భారతి

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన మనిపూరి లచ్చమ్మ (30)కు 108లో ప్రసవం జరిగింది. స్థానిక ముగ్గువారిపేటకు చెందిన లచ్చమ్మకు ఇప్పటికే నెలలు నిండి ఉండటంతో హఠాత్తుగా నొప్పులు ప్రారంభమయ్యాయి. అంతలో మండలానికి చెందిన 108 అంబులెన్స్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గర్భిణి లచ్చమ్మను వాహనంలో ఎక్కించారు. ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో స్పందించిన ఈఎంటీ ఈతకోట భారతి, పైలట్ పల్లికొండ రాజేష్ సహకారంతో సుఖ ప్రసవం చేయించడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.